**International Journal of Academic Research**
**ISSN: 2348-7666; Vol.3, Issue-4(2), April, 2016**
**Impact Factor: 3.075; Email: drtvramana@yahoo.co.in**

# మౌళిత్రయ కవులు - భక్తి సాహిత్యం

డా॥ అక్కెనపల్లి వెంకట్‌రాం రెడ్డి
ఉస్మానియా విశ్వవిద్యాలయం

ఆధ్యాత్మిక చింతనలకు, సంగీత సాహిత్యాది కళలకు, జానపదరీతులకు, సంస్కృతి సంప్రదాయాలకు నెలవైన తెలంగాణ ప్రాంతంలో మట్టిలో మాణిక్యాల్లా ఉండి, ఎటువంటి ప్రచార ఆర్భాటాలకు తావివ్వని, పేరుప్రఖ్యాతుల కొరకు ప్రాకులాడనివారు మౌళిత్రయ కవులు. వీరిలో మొదటి వారు విఠాల చంద్రమౌళి శాస్త్రి, రెండవవారు విఠాల రాజమౌళి శాస్త్రి, మూడవవారు రుక్మాభట్ల విధుమౌళి శాస్త్రి.

సంగీత సాహిత్యాలు, సంస్కృతాంధ్రం, జ్ఞానవైరాగ్యాలు, ఐహికాముష్మికాలు, బోధనాచరణాలు, ఆర్జన-త్యాగం వంటి అనేక సుగుణాలకు ఆలవాలమైన విఠాలవారి వంశంలో మౌళిత్రయం వారు జన్మించారు. వీరి తాత గుండయ్యశాస్త్రి సంస్కృతాంధ్రాలలో మహాపండితుడు. భాష్యాంత ప్రవచనం చేయగల మహాపండితుడై ఉండి కూడా చమత్కార సంభాషణంలో ఆనాటి సమాజంలో పేరెన్నిక గన్నవాడు. వీరి తల్లి శ్రీమతి వెంకమ్మ నాగపురి వాస్తవ్యులు పార్నంది వెంకట్రామయ్యగారి ప్రథమ పుత్రిక. రాజయ్య శాస్త్రి-వెంకమ్మ దంపతులిరువురితో పాటు వీరి సంతానంలోని వారందరు రామభక్తి పరాయణులే. వీరి ప్రథమ సంతానం రుక్మిణమ్మ.

వీరు బాల్యం నుండి జీవన సమాప్తి పర్యంతం రామభక్తితో రామభక్తుల సేవతో తరించింది. రెండవ సంతానం శ్రీమతి రాధాబాయమ్మ. ఈమె పరమ సాధ్వీశిరోమణి. చంద్రమౌళి పేరుకు తగినట్లుగా ఈమె శ్రీకృష్ణ భక్తురాలు. ఇక మూడవ సంతానమే విఠాల చంద్రమౌళి శాస్త్రి. ఆకాలంలో శతావధానిగ, ఆధ్యాత్మిక రంగంలో ఆదర్శపురుషులుగా, సోదరులకు మార్గదర్శకులుగా, ఆదర్శభ్రాతృ ప్రేమకు నిలువెత్తు నిదర్శనంగా, భక్తి తత్త్వప్రేరేపకులుగా జగత్ప్రసిద్ధులైన పండితులు. నాల్గవ సంతానం విఠాల రాజమౌళి శాస్త్రి, వీరు హరికథకులుగా, పురాణ ప్రవక్తలుగా పండితులుగా ప్రశస్తిపొందిన విద్వద్వరేణ్యులు. ఐదవ సంతానం విధుమౌళి శాస్త్రి. వీరి చెల్లెలు 'చెల్లెమ్మ' చివరి సంతానం. వీరిది మెదక్ జిల్లాలోని గజ్వేల్ పట్టణం.

**మౌళిత్రయ కవుల భక్తి సాహిత్యం :**

"మోక్ష సాధన సామగ్ర్యాం భక్తిరేవగరీయసి" ఎంతటి కర్మిష్ఠులైనా ఎంతటి వేదాంత జ్ఞాన సంపన్నులైనా భక్తిని ఆశ్రయించకుండా మోక్షసాధన కష్టసాధ్యం. మహామహా జ్ఞానులు కూడా చివరి దశలో భక్తిని ఆశ్రయించడం. భక్తితో పరమాత్మలో ఐక్యం చెందడం అనేక సందర్భాల్లో కన్పిస్తుంది.

భక్తి నవ విధాలుగా వుంటుందని పేర్కొనబడింది. అవి 1. శ్రవణం 2. కీర్తనం 3. స్మరణం 4. పాద సేవనం 5. అర్చనం 6. వందనం 7. దాస్యం 8. సఖ్యం 9. ఆత్మ నివేదం.

పై నవవిధ భక్తులకు వరుసగా 1. పరీక్షిత్తు 2. నారదుడు 3. ప్రహ్లాదుడు 4. భార్గవి 5. పుత్రుడు 6. అక్రూరుడు 7. గరుత్మంతుడు 8. ధనంజయుడు 9. బలిచక్రవర్తి అనువారలు దృష్టాంతాలుగా నిలుస్తారు. భజనలో శ్రవణం, కీర్తనం, స్మరణం మూడు చేరతాయి. అందుకే మౌళిత్రయం వారు భజనకత్యంత ప్రాధాన్యత నిచ్చారు.

**చంద్రమౌళి శాస్త్రి భక్తి సాహిత్యం :**

చంద్రమౌళి శాస్త్రి తన రచనలన్నింటిలోనూ గూఢమైన వేదాంతంతో పాటు తమ ఉపాస్యదైవాన్ని అనుక్షణం స్మరిస్తూ, కీర్తిస్తూ రచన సాగించారు. లోకంలోని దుర్వ్యవహారాలను ఖండించుట. భక్తియుతమైన జీవనాన్ని ప్రకటించుట, తమ ఇష్టదైవం యొక్క అఖండశక్తిని, అనితర సాధ్యమైన దయాగుణాన్ని, సర్వేశ్వరత్వాన్ని అనేక సందర్భాలలో కీర్తిస్తూ రచనలు సాగిస్తారు. వారి ఇటువంటి రచనల్లో మాతృప్రేమ, భక్త విజ్ఞప్తి మొదలగుకృతులు ప్రముఖంగా పేర్కొనదగినవి. సాత్విక, రాజస, తామస భక్తవిజ్ఞప్తిగా తమ భక్తవిజ్ఞప్తి గ్రంథాన్ని తమ బహుశాస్త్ర పరిజ్ఞాన ప్రకటన స్వరూపంలో రచించారు.

అనేక చక్రి భజనల్లోని పద్యాలు, కీర్తనలు, మేలుకొలుపు, జోలపాటలు, లాలిపాటలు అనేకం రచించారు. శ్రీరామ ప్రబోధం అను జ్ఞానవాసిష్ట్యంలోని నిర్వాణ ప్రకరణానికి చంద్రమౌళి శాస్త్రి తాత్పర్యంలను రచించారు. ఆ పుస్తకం చివర శ్రీరామ భక్తుల కోరికమేరకు మేలుకొలుపు, జోలపాట, లాలిపాటలు రచించి చేర్చినారు. ఇందలి ప్రతి పద్యం శ్రీరామ కథామృతమయమై యున్నది.

ఉదాహరణకు –

"నినురణమందు ఘోరశరనిష్ఠుర ఘాతములన్ దపింపజే
సిన దనుజాళికిచ్చితివసీమదయన్ సుకృతైక రాశికం
దని నిజధామమున్ శ్రిత ఘృణామయ మానస నేను వాం
ఛ నయిన మించినానో యకటా ననుమన్నవు జానకీపతి"

– (శ్రీరామ ప్రబోధం – అనుబంధం)

మాతృసేవ పేరిట అనేక జోలపాటలు, లాలిపాటలు, మేలుకొలుపు రచించి యున్నారు. వీటితో పాటు చంద్రమౌళి శాస్త్రి సంస్కృతాంధ్రాలలో రచించిన అనేక మంగళహారతులు (నీరాజన గీతాలు) నేటికి అనేక మంది భక్తుల నోళ్ళలో నానుచున్నవి. సంస్కృత భాషా పరిమళ పూరితంలైన ఆంధ్రగీతాలు కూడా పండితపామర జనరంజకాలై వినిపిస్తూనేవున్నాయి.

భువనేశ్వరీభజన, బాలభజన, రాధాకృష్ణభజన, కృష్ణభజన, రామభజన మొదలైన అనేక చక్రిభజనలకు చంద్రమౌళి శాస్త్రి తమపద్య మాధుర్యాన్ని చేకూర్చారు. రాధాకృష్ణ భజనలోని ఈ పద్యం...

> "బంగరు తొట్లె శ్రీ లలిత। పాటలు పాడుచు నూపనందు పా
> దాంగుళి కేలనోటనిడి। నానుచుడాగిన బాలకాకృతిన్
> పొంగుచు వచ్చునీ కలిసముద్రము ద్రావ సమర్థుడెవ్వడో
> మంగళ రూపలెమ్ము వడిమమ్ముల నేలులు రాధికాపతీ"
> – (శ్రీరాధాకృష్ణ భజనావళి)

వారి అనేక పద్యాలలో జ్ఞాన వైరాగ్యాలతో పాటు విశేషమైన భక్తి తాత్పర్యాలు కన్పిస్తుంటాయి. వారి మాతృప్రేమలోని అనేకపద్యాలు భక్తిరస ప్లావితంలై దర్శనమిస్తాయి.

## రాజమౌళి శాస్త్రి భక్తి సాహిత్యం :

భక్తిజ్ఞాన వైరాగ్యాలు మూర్తీభవించిన విద్వద్భక్త విభామణి ఆజన్మాంత, అనునిత్య పార్థివ లింగార్చనా తత్పరులు, రచనా, ప్రవచనంలో సవ్యసాచి అయిన రాజమౌళి శాస్త్రి భావానంద రామాయణం, తందనాన భారతంతోపాటు పద్య గద్య కీర్తనాత్మకాలైన అనేక హరికథలు రాజమౌళి శాస్త్రి రచించారు.

సందర్భోచితమైన రాగ తాళంలను, గాన విధానంలను సమకూర్చి ఆయాకథలను హరికథా కథన విధానానికి అనుకూలంగా రూపొందించిన ప్రతిభామూర్తి రాజమౌళి శాస్త్రి. దత్తాత్రేయ చరిత్రం, శ్రీహరివిలాసం, భీమభక్తి, సీతాద్వాదశీవ్రతం, సిరియాళ చరిత్ర, పింగళాచరిత్ర, శశిరేఖాపరిణయం, హనుమజ్జననం మొదలగు అనేక కథలను రాగతాళ, గద్యపద్య గాన ప్రవచనానుకూలంగా రచించినప్పటికి అవి ముద్రణకు నోచుకొనకపోవుట విచారకరం.

ఇవేకాక భావానంద రామాయణమను పేర మొత్తం రామాయణాన్ని హరికథారూపకంగా రచించారు. ఇందులో దశకంఠవిజయం, సీతారామ జననం, సీతారామ పరిణయం, భరతవైరాగ్యం

మొదలైన పేర్లతో అనేక హరికథలు రచించబడ్డాయి. సందర్భానుగుణంగా కథావసరాన్ని బట్టి భక్తి భావాలను చేర్చి తమ సహజాతమైన భక్తి తత్వంను ప్రదర్శించియున్నారు.

కథా ప్రవచనాల చేత అనేకమంది శ్రోతలను ముగ్ధులను చేయగల్గిన రాజమౌళి శాస్త్రి భక్తి ప్రభోదం చేత జనులకు సన్మార్గంనుపదేశించారు. జీవితాంతం ప్రతినిత్యం ఏదో ఒక పురాణ ప్రవచనం చేసిన రాజమౌళి శాస్త్రి ఆయా సందర్భాలలో శ్రోతలకు సన్మార్గాచరణను, భక్తి మార్గానుసరణను నిరంతరం బోధిస్తూ వుండేవారు.

## విధుమౌళి శాస్త్రి భక్తి సాహిత్యం :

విధుమౌళి శాస్త్రికి కీర్తి లభించినది శ్రీరామభక్తి వలన వారి బిరుదం కూడా "శ్రీ రామపదపరాగ్" అని పేర్కొనబడ్డది. తందనాన రామాయణం, శివలీలలు మొదలగునవి. జానపద సాహిత్యంలోను రామభజన, కృష్ణభజన మొదలగు అనేక చక్రి భజనల్లోనూ లెక్కకు మిక్కిలిగా వారు రచించిన అనేక మంగళగీతాలలోనూ వారి భక్తి తత్పరత ద్యోతకమవుతుంది. వారి తందనాన రామాయణంను గజ్వెల్ రామచంద్రుని దయవలననే రచించితినని ఫలశ్రుతిలో అనేక పర్యాయాలు విధుమౌళి శాస్త్రి పేర్కొన్నారు. రామకథారచన సాగుతున్న అనేక సందర్భాలలో అవసరాన్ని, అవకాశాన్ని బట్టి భక్తి తత్పరతను పొందు పరచారు. అనేక చక్రి భజనల్లో ఆయా భజనల మధ్యలో కీర్తనలన్నింటిలో ఆయా దేవతలకు అనేక ఉపచారాలు సమర్పిస్తూ రాయబడ్డ కీర్తనలు, భక్తియుతమై, పూజామయంలై కన్పిస్తుంటాయి. చక్రిభజన సంప్రదాయం ఈ ప్రాంతానికి కొంతవరకు కొత్తదే అయినప్పటికీ విధుమౌళి శాస్త్రి తమ సోదరుల సహచరుల సహాయంతో అనేక గ్రామ, పట్టణాల్లో 108 కి పైగా భజన సంఘాలను నెలకొల్పి నాటి గ్రామీణ ప్రజల్లో భక్తి, ఆధ్యాత్మిక చైతన్యాన్ని, సన్మార్గ ప్రవర్తనను నెలకొల్పుటకు గావించిన కృషి నిరుపమానం.

శాస్త్రిగారు 108 భజన సంఘాలు సిద్ధిపేట పట్టణంలో ఒక్కచోట చేర్చుట ఆనాటి అపురూప భక్తి విప్లవానికి నిదర్శనం. దీనిలో విధుమౌళి శాస్త్రి అత్యంత క్రియాశీలక పాత్ర నిర్వహించారు. అనేక మంగళ హారతులను వివిధ దేవతలపైన రచించారు. సినిమా సంగీతంలో ఆ కాలంలో బాగా ప్రాచుర్యం పొందిన తరజులలో అనేక మంగళ గీతాలను భక్తిపూర్వకంగా రచించారు. వీటిలో సంస్కృతమయమైనవి తెలుగుని, సంస్కృతాంధ్రమయములు అయిన మంగళ గీతాలెన్నో వున్నాయి. నేటికినీ గజ్వెల్‌లోని శ్రీరామాలయంలో విధుమౌళి శాస్త్రి రచించిన భక్తియుతమైన ఈ క్రింది మంగళ గీతం ప్రతి నిత్యం గానం చేయబడుతుంది.

మంగళం మహిజాధవా! మౌనినుత మాం పాహి దేవా!
సంగరహిత రిపుహరా! సదమలాంగ సురేశ్వరా! ॥మం॥
పవన తనయాపన్నివారణ పాపహర కాననవిహరణ
భవహరణ సద్గుణగణా భరతపూజిత పద్మచరణా! ॥మం॥
సాధుగుణపరిపాలనా సరసిజానన పీతవసనా
బాధర మధుసూధనా! విధుమౌళి భూసురపాలనా ॥మం॥

ఇట్లు రాముడు, కృష్ణుడు, శివుడు, ఆంజనేయుడు, శ్రీదేవి మొదలగు దేవతలపైన లెక్కకు మిక్కిలి మంగళ గీతాలను రచించారు. వీటితోపాటు అనేక దేవతల స్తోత్రాలు, మేలకోలుపు, లాలిపాటలు, జోపాటలు రచించారు.

చిలువూరి వేంకటేశ్వరస్వామి పైన రచించిన ఈలాలిపాట...

లాలిశ్రీ వేంకటేశా సర్వేశ లాలి భక్తాఘనాశ
జాలిదీర్పుముపరేశ జగదీశ! లీల జాలింపుమీశ

చ॥ అలవేలుమంగతాయి – నిదురింప అరయుచున్నదిగదోయి
అలసితివిరాగదోయి – జగమునందాట జాలింపవోయి

ఇది చాలా ప్రసిద్ధం. అనేక మంగళహారతులలో చివరన శాస్త్రిగారు విధుమౌళి అని చేర్చియుండుటవల్ల అది వారి రచనగా గుర్తించుటకు వీలు కల్గుతున్నది. ఏది ఏమైనా తెలంగాణ ప్రాంతంలో భక్తి సాహిత్యాన్ని పెంచి పోషించినవారు "మౌళిత్రయ" కవులు. ఆధునిక కాలంలో వీరి గురించి సాహిత్య లోకానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆధాన గ్రంథాలు :**

1) శ్రీరామ ప్రబోధం – విఠాల చంద్రమౌళి శాస్త్రి.

2) శ్రీ రాధాకృష్ణ భజనావళి – విఠాల చంద్రమౌళి శాస్త్రి.

3) శ్రీరామ భజనావళి – విధుమౌళి శాస్త్రి.

4) భావానంద రామాయణం – I, II (అముద్రితం) – రాజమౌళి శాస్త్రి.